# పనిమనిషి

ఆశ్చర్యమేమిటంటే నరసింహం, మనిషి కెన్ని కష్టాలు రావచ్చునో అన్ని కష్టాలనుభవిస్తున్నప్పుడు, ఆదర్శప్రాయురాలైన భార్యగా ప్రవర్తించిన శకుంతల, కాలపరివర్తనతో మనఃపరివర్తన పొంది, సమీపస్తుల కసహ్యా కారణమైంది.

నరసింహం ఆశ్చర్యపడ్డాడు. అప్పటిదా, ఇప్పటిదా తన భార్య సహజ స్వరూపం? అతని కంతుపట్టలేదు.

ఇది తప్పక డబ్బుతో వచ్చిన మార్పే! ఒకరికి నయం చేసే విషం మరొకర్ని చంపుతుంది! ఒకరికి ప్రాణమిచ్చే డబ్బు మరొకరి జీవాలు లాగేస్తుందా?

డబ్బు నిజంగా విషతుల్యమా?

గాంధీ ఉపవాసదీక్షను గురించి అన్న ముక్క జ్ఞాపకం వచ్చిందనికి. డబ్బుకూడా ఒకవిధమైన శక్తి. సమర్థుడి చేతిలో అది ఎంత పనైనా చేస్తుంది. అసమర్థుడి మీద చేతకాని చేతబడి మాదిరిగా బెడిసికొడుతుంది. దుష్ప్రయోగ ఫలితం!

అయినా తను డబ్బు సంపాదిస్తుంటే తన భార్య అడావుడి పడవలసిన అగత్యం కూడా అట్టే లేదు, కాని –

నిజానికి, పాపం, శకుంతల తన కష్టాల్లో పాలుతీసుకున్న మనిషి ఒక్క రవ్వయినా సణగకుండా తన సుఖం ఎందుకు పంచుకోరాదు?

శకుంతలను నిర్బంధించ వద్దనుకున్నాడు నరసింహం.

విజయలక్ష్మిని వశం చేసుకున్న వాళ్ళయొక్క కథలనేకంగా వింటున్నాం. కాని వాళ్ల ప్రకృతి వివరంగా ఎక్కడా చెప్పబడటంలేదు. ఆ కారణం చేత ఎవరో లక్షలు, కోట్లు సంపాదించారనుకోవటమే కాని అవి మరొకళ్ళు సంపాదించాలంటే ఎట్లా ఉండాలో స్పష్టంగా తెలుసుకోలేకుండా ఉన్నాం. నరసింహం సంసారపక్షంగా విజయం పొందిన వాడికిందలెక్క. కాబట్టి అతని ప్రకృతిని గురించి తెలుసుకోవటం కొంతవరకు ఏ కొద్దిమందికయినా ఉపకారంగా ఉండకపోదు.

అనేక విషయాల్లో అతను నాజూకులేని మనిషి. ఈ వివిధ కళల్లో అతనికి చెప్పుకోతగ్గ అభిరుచిలేదు. అనేకమందీ అతనికి డబ్బు సంపాదనే పని అనుకునేవాళ్ళు.

అతనికి దేన్ని గురించీ ఎవ్వరితోనూ అభిప్రాయ భేదం లేదు. అందరితోనూ మాట్లాడేవాడు, ఎవరితోనూ వాదించేవాడు కాదు, పోట్లాడేవాడు కాదు. పూసుకు తిరిగేవాడు కాదు. అతిగానైనా మాట్లాడేవాడు కాదు. ఇంకోళ్ళ కాలం అతను వ్యర్థం చెయ్యటానికీ, తన కాలం ఇతరులు వ్యర్థం చెయ్యటానికీ కూడా తనకు విరామం లేదని స్పష్టంగా సూచించేవాడు. అతని కింకో విచిత్రమైన గుణం ఉంది. అతనికి ఏ పని చేస్తే డబ్బు లభిస్తే ఆ పనిలో అభిరుచి కలిగించుకునేవాడు. అతను ప్లీడరు వృత్తిలో ప్రవేశించేటప్పుడు కాఫీ హోటళ్ళ మాదిరిగా, చుట్టలు బీడీల మాదిరిగా అవసరమైన ప్లీడర్లు ఊళ్ళో నలుగురైదుగురి కన్న లేరని గమనించి జూనియర్లకు ఫైలులేదని చూస్తూనే ఆ వృత్తిలో దిగాడు. ఆ వృత్తిని చూస్తే తనకు గౌరవం లేదని మాటవరసకైనా ఎవరితోనూ అన్న పాపాన పోలేదు.

అతనికి ఆలోచనను గురించి ఆలోచించే దురభ్యాసం లేదు. అటువంటి అలవాటు కవులకూ, కల్పనాకథలూ రాసేవాళ్ళకూ కావాలి కాని డబ్బు సంపాదించే వాడికక్కర్లేదు.

అతనిలో మెచ్చుకోవలసిందేమిటంటే, బాలెన్స్ – తూకం. అతను గడచిన పది సంవత్సరాల్లోనూ తూకం తప్పి – తలవంచుకోవలసిన పనిచేసి ఎరగడు. ఎంత ఉద్రేకమూ మొహాన ఒక్కరవ్వయినా కనపడనిచ్చేవాడుకాదు.

అతనిచేత డబ్బు ఖర్చు పెట్టించదలచిన వాళ్ళు అతన్ని ఏ విధంగానూ సమీపించలేక సంఘానికంత అనవసరమైన మనిషి లేడన్నారు. అతనికి డబ్బిచ్చి పొయ్యేవాళ్ళు 'ఆ మహారాజున్నాడు కాబట్టే బతికిపోతున్నాం' అన్నారు – అతన్ని సమీపించలేక పోయినప్పటికీ! పార్టీలచేత అంతమాట అనిపించుకున్న జూనియరుకు ముందు ముందు చాలా లాభం ఉంది.

పాతికేళ్ళపైగా – నరసింహం తండ్రిగారి కాలంలో వచ్చారు, నరసింహం గారి ఆవరణలో చిన్న గుడిసెవేసుకుని – ఒక శూద్ర కుటుంబం ఉంది – రంగమ్మా, పిల్లలూ. రంగమ్మ పెద్దకొడుకు పొరుగూళ్ళో ఒక డాక్టరుగారి దగ్గిర నెలకెనిమిది రూపాయలు తెచ్చుకుంటున్నాడు. వాడప్పుడప్పుడూ వస్తుండేవాడు. నరసింహం తండ్రిగారు ఒంగోలు తాలూకా కరువు సమయంలో పారిపోయి వచ్చిన ఈ కుటుంబాన్ని చేరదీసి వాళ్ళకు కాస్త స్థలమూ కొంపా యిచ్చి, రంగమ్మ మొగుడికి కొంత డబ్బిచ్చి బతుకుతూ ఉండమన్నాడు. రంగమ్మ ఇంటివారికి అడ్డమైన చాకిరీ చేసి ఒక్క పైసా అయినా తీసుకోక రుణం తీర్చుకుంది చాతయినట్టుగా! కాని కొత్త రుణానుబంధం ఏర్పడ్డది. నరసింహం తల్లి అతని నెలల్లో పోయింది. నరసింహానికి రంగమ్మే తల్లయింది – పొయ్యటానికీ, పెట్టటానికీ తప్ప. పొయ్యటమూ, పెట్టటమూ మాత్రమే మాతృత్వం అనుకునే వాళ్ళకు నరసింహాన్ని పెంచిన

వాళ్ళు పాఠం నేర్పారు. నరసింహం దుర్దినాల్లో అంతా జారారు. మొగుడుపోయి, దేముడంటి యజమాని నరసింహం తండ్రిపోయి అక్కడక్కడా పాచిపని చేసుకు బతుకుతున్న రంగమ్మ అప్పుడప్పుడూ నరసింహానికి పావలాకూ అర్ధకూ సహాయపడ్డది.

శకుంతలకు అతిశయం ఎప్పుడొచ్చిందో ఎట్లా వచ్చిందో ఎవరూ గమనించలేదు. ఆవిడకు మనుష్యులంటేనే అనుమానం. రంగమ్మ తమచేత నియోగింపబడ్డ పనిమనిషి కాదని శకుంతల ఎరుగును. కాని తన భర్తవల్ల ఏదో రూపంగా ప్రతినెలా అయిదారు రూపాయలు ముట్టజెప్పించుకుంటూన్న నాటినించి (టెక్నికల్‌గా) రంగమ్మ పనిమనిషి అయిపోయిందని శకుంతల తన్ను తాను నమ్మించుకుంది. తన కొడుకు, నెలలవాడు, రంగమ్మ చేతుల్లో ఉంటే నల్లబడుతున్నట్టుగా ఉండేవాడు. కల్మషం వాడిలో రంగమ్మ చేతులయొక్క స్పర్శవల్ల ప్రవేశిస్తున్నట్టుండేది శకుంతల మనస్సుకు. ప్రతిరోజూ రంగమ్మ చేత ఎత్తుకోబడే వాడూ ఎన్నడూ రంగమ్మ స్పర్శ ఎరగనివాడూ ఒకటిగానే ఉంటారా? పదేళ్ళలో పెద్ద మార్పుండదా? ఇటువంటి వాటిల్లో మడి కొంత తప్పకుండా ఉండే ఉండాలి! కొంత కొంతమంది రాసే కథలలో జరిగినట్టు ఈ కుర్రవెధవ తన చేతులలోనించి దాని దగ్గిరికి అలా పరిగెత్తటమేమిటి? మళ్ళీ దాని దగ్గిర్నించి తన దగ్గిరికి రమ్మంటే స్పష్టంగా ఉఁహూఁ అని తల ఊపటమేమిటి? తన పిల్లవాణ్ణి గురించి అన్నీ రంగమ్మకు కావాలా? అన్నీ తను చెయ్యాలి. తనకు చెందాలి - రంగమ్మ ఇంకేం, రంగమ్మకి మనుమడులేని లోపమే తీరిపాయె! మనమణ్ని ఇంతకన్న ఎక్కువ చేసుకునేదేముంది? "అమ్మగారూ! అబ్బాయిగారికి నీళ్ళు పొయ్యరేమండీ? నేను పొయ్యనా?" "అమ్మగారూ! అబ్బాయిగారికి భోజనం పెట్టలేదండీ కడుపేడుస్తుందీ!"

శకుంతల రంగమ్మతో మెల్లిగా ప్రారంభించి పోట్లాడటం క్రమంగా హెచ్చించింది. తనకు రంగమ్మమీద గల అసహ్యం మొగుడిముందు దాద్దామనైనా ప్రయత్నం చెయ్యలేదు.

అనుకోకుండా వచ్చింది శకుంతల అహంకారాని కంత్యదశ.

ఒకరోజు పిల్లవాడి మెళ్ళో గొలుసులేదు. అంతకు మునుపు రంగమ్మే ఆడిస్తున్నది పిల్లవాణ్ని. శకుంతల రంగమ్మను ముందూ వెనకా చూడకుండా అనుమానించింది. మాటకూడా రానంత కోపంతో రంగమ్మ గుడిసె దగ్గిరికిపోయి పిల్లవాడి గొలుసు, దొంగిలించినది, ఇచ్చేసెయ్యమంది యజమానురాలు. రంగమ్మ తను గొలుసునెరగనంది. కథలలో జరిగే గుడిసె సోదాలూ, నగలక్కడ కనిపించకపోవటం శకుంతలకు జ్ఞాపకం రాలేదు. ఆవిడ చరాచరా లోపలికి పోయి సోదా ప్రారంభించింది. ఎంతో సోదా అవసరం లేకపోయింది. బియ్యపు చాటలో సగం బియ్యం అడుగునా, సగం పైకి కనబడేటట్టూ గొలుసు మెరుస్తున్నది. దీనికేమంటావన్నది శకుంతల. రంగమ్మ అవమానంతో

తలవంచుకోలేదు. నాకేమీ తెలీదు పొండన్నది. శకుంతల రంగమ్మను తక్షణం బయటికి నడవమన్నది. రంగమ్మ సరేనని తట్టా, బుట్టా బయట పడేస్తుండగా బజారు వెళ్ళిన నరసింహం వచ్చాడు. సంగతంతా కనుక్కున్నాడు. అతనికి నవ్వాగలేదు. శకుంతలకు ఒక విధమైన భయం కలిగింది.

అతనెంత చెప్పినా పోతానని భీష్మించింది. నరసింహం భార్యతో రంగమ్మను పోవద్దని బతిమాలమని లోపలికి వెళ్ళిపోయినాడు. శకుంతల ఎట్లా అర్థం చేసుకుందో, వేరే బతిమాలటం లేకుండా క్షమాపణే ఇచ్చింది రంగమ్మకు!

***మొదటి ముద్రణ : ఆంధ్రభూమి, ఫిబ్రవరి 1935***